క్లుప్తంగా

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వై.ప్రకాష్‌రెడ్డి



కర్నూలు(లీగల్) : కర్నూలు నాలుగో అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా యామసాని ప్రకాష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఆయన కర్నూలు జిల్లా నాలుగో అదనపు జిల్లా కోర్టు (ఫ్యామిలీ కోర్టు)లో బాధ్యతలు స్వీకరించారు. ప్రాసిక్యూషన్ తరపున తన వాదనలు వినిపించనున్నారు. ఈయన 1995వ సంవత్సరం కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకుని తన వృత్తిని కొనసాగిస్తున్నారు. సీనియర్ న్యాయవాది ఎ.రామసుబ్బారెడ్డి దగ్గర కొంతకాలం జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. ఈయన ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగనున్నారు.

సహకార బ్యాంకుల్లో ప్రైవేట్ పెట్టుబడులు వద్దు

కర్నూలు(సెంట్రల్) : సహకార బ్యాంకుల్లో ప్రైవేటు పెట్టుబడులు పెట్టడానికి అనుకూలంగా చట్టంలో మార్పులు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, సహకార ఉద్యోగ సంఘాల నాయకుడు మురళీ, నరసింహమూర్తి, మద్దిలేటి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు. సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టి ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించడం సరికాదన్నారు.

20న జాబ్‌మేళా

కర్నూలు సిటీ: ఈ నెల 20వ తేదీన ఎస్టీబీసీ కాలేజీలో స్టేట్ బ్యాంకు ఆఫ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో వివిధ ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ కరస్పాండెంట్ డా.ఆర్ ఆర్‌డీ సంజీవరాజు, ప్రిన్సిపల్ డా.ఆర్ ప్రశాంతి శ్యాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్: 9533529686, 9441224405 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆలయ భూములు రక్షించాలి

కర్నూలు(సెంట్రల్) : జొహరాపురం నీలకంఠేశ్వర స్వామి ఆలయ భూములను పరిరక్షించాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల నుంచి దేవాలయ భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం వీహెచ్‌పీ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నీలకంఠేశ్వరస్వామి ఆలయ భూమి 7.2 ఎకరాల ఉందని, దానిలో వేసిన అనధికార నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్

కర్నూలు సిటీ: నగర శివారులోని రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఏడు రోజుల పాటు వెంకాయపల్లెలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఆ పంచాయితీ సర్పంచ్ వెంకటేశ్వర్లు హాజరై గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల గురించి విద్యార్థులు తెలుసుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు చక్కగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.కేతు శ్రీనివాసమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ జె.ఉషశ్రీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అహల్య పాల్గొన్నారు.

20 లోపు దరఖాస్తులు సమర్పించండి

కర్నూలు (టౌన్) : నగరపాలక పరిధిలోని కాల్వల్లో పూడిక తీయడం, సెంట్రల్ మీడియన్స్‌లలో మొక్కలకు నీరు పోయడం వంటి పనుల కోసం తాత్కాలిక కాంటిజెంట్ వర్కర్ల నియామకం కోసం టౌన్ లెవల్ ఫెడరేషన్లు, స్వయం సహాయక బృందాలు ఈనెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కంటింజెంట్ వర్కర్‌కు రోజుకు రూ.400 సర్వీసు చార్జీల కింద 3 శాతం నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

24న రాయలసీమ కర్తవ్య దీక్ష

కర్నూలు కల్చరల్: సిద్ధేశ్వరం – సోమశిల ప్రాజెక్ట్ దగ్గర బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన రాయలసీమ మేధావుల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న రాయలసీమ కర్తవ్య దీక్షను విజయవంతం చేయాలని ఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ కోరారు. సోమవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాయలసీమ విద్యార్థి పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పి.అశోక్, ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

సెలవుల్లో సమాజాన్ని చూపిద్దాం!

- సినిమాలు, షాపింగ్‌లు ఒక్కటే కాదు...
- పిల్లలకు కుటుంబ ఆప్యాయతలను తెలియజేయాలి
- పోలీసు, ఫైర్, హాస్పిటళ్లకు తీసుకెళ్లాలి
- తల్లిదండ్రులే పిల్లలకు రోల్ మోడల్ కావాలి
- స్విమ్మింగ్, సైక్లింగ్, ఆటల్లో తర్ఫీదు ఇప్పించాలి



కర్నూలు(సెంట్రల్): మరో వారం రోజుల్లో పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించనున్నారు. ఇప్పటికే చిన్న పిల్లల తరగతులకు సెలవులు ఇచ్చారు. ఇంకేముంది ఇళ్లలో పిల్లల అల్లరే అల్లరి. ఎగరడం, దూకడం, నవ్వడం, ఏడవడం ఇలా ఏమి చేసినా పిల్లల అల్లరే కనిపిస్తోంది. వారి అల్లరి పోరును భరించలేక సినిమాలు, షాపింగ్‌లకు తిప్పి తప్పించుకోవడం తల్లిదండ్రుల బాధ్యత కాదు. వారిలో సామాజిక స్పృహను పెంచి భావి భారత పౌరుడిగా తయారు చేయాలి. స్వయంగా తల్లిదండ్రులే పిల్లలకు రోల్ మోడల్‌గా ఉండి సమాజంపై అవగాహన కల్పించాలి. వివిధ సంస్థల పనితీరు, వాటి బాధ్యతలను వివరించాలి. వారి మనసులో ఏముందో తెలుసుకోవాలి. ఆత్మస్థైర్యం కోసం ఈత, సైక్లింగ్, ఆటలను నేర్పాలి. దేశానికి అన్నం పెట్టే రైతన్న, వృద్ధులు, రోగులు పడే ఇబ్బందులు, కుటుంబ ప్రేమానురాగాలు, మత సామరస్యంపై అవగాహన పెంచితే భవిష్యత్‌లో ఉత్తమ పౌరుడిగా రాణించేందుకు అవకాశం ఉంటుంది.

తల్లిదండ్రులదే బాధ్యత...

ఒక పిల్లవాడు ఉత్తమ పౌరుడిగా రాణించాలన్నా, చెడు వ్యసనాల జోలికి వెళ్లాలన్నా వాడి పెంపకంపై ఆధారపడి ఉంటుంది. చిన్న తనం నుంచే పిల్లలను తల్లిదండ్రులు సరైన మార్గదర్శకత్వంలో పెంచితే ఉత్తమ పౌరులుగా తయారవుతారు. అదే వారిపై చిన్నచూపు చూస్తే సంఘ విద్రోహ శక్తిగా మారే ప్రమాదం ఉంది. అంటే పిల్లల నడవడిక తల్లిదండ్రులపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు పిల్లల కోర్కెలకు అనుగుణంగా నడుచుకోవాలి. ముందు వారి మనసులో ఏమి ఉందో తెలుసుకోవాలి. అందుక నుగుణంగా వారికి కావాల్సిన వాటిని సమకూర్చాలి. ఇందులోనూ ఉత్తమైన లక్షణాలను పెంపొందించే వాటికే ప్రాధాన్యం ఇచ్చి మిగతా వాటిని మరిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుంది. ఉదాహరణకు ఒక పిల్లవాడు క్లాసులో తన స్నేహితుడి పెన్సిల్ లేదా స్కేల్ చోరీ చేశాడనుకుంటే దానిని మైమరపించాలి. లేదంటే వాడు భవిష్యత్‌లో దొంగగా మారే ప్రమాదం ఉంది. అదే బాలుడు స్నేహితులతో కలసి మంచి పుస్తకాలు చదువుకోవడానికి ఆసక్తిని కనబరిస్తే ప్రోత్సహించాలి. పిల్లలు పెరిగి పెద్ద అయ్యే సమయంలో వారి చుట్టూ ఉన్న స్నేహితులు, బంధువుల నడవడికను గమనించాలి. వారు చేసే పనులపై ఒక కన్ను వేసి ఉంచాలి. కాలేజీకి వెళ్లాడనో..ఉద్యోగం చేస్తున్నాడనో ఆటువైపు చూడకుండా తల్లిదండ్రులు వదిలివేస్తే సంఘ విద్రోహ శక్తులుగా మారే ప్రమాదం ఉంది. నిత్యం పిల్లలు ఏమి చేస్తున్నారో తెలుసుకోవడానికి తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలి.

పిల్లల్లో సామాజిక స్పృహ పెంచే కొన్ని అంశాలు

ఆత్మస్థైర్యం: చిన్నతనం నుంచే పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపాలి. సముద్రాలు, నదులు, కాలువల్లో కొట్టుకుపోకుండా తనంతకు తానే బయటపడే విధంగా ఈత నేర్పాలి. అంతేకాక భారతం, రామాయణం, భగవద్గీత, ఖురాన్, బైబిల్ గ్రంథాలను వీలు చూసుకొని చదివించాలి. అందులోని పాత్రల్లో వారు మైమరచిపోయేవిధంగా చేస్తే ఆత్మస్థైర్యంతో జీవితంలో ఏ సమస్యనైనా ఎదుర్కొనే శక్తి వారికి వస్తుంది.

రోల్ మోడల్: పిల్లలకు తల్లిదండ్రులే రోల్ మోడల్ అనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. ఇందుకోసం వారు అనుకరించేలా కొన్ని పనులను పెద్దలు చేయాల్సి ఉంటుంది. రక్తదానం, చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, జాతీయ ఆస్తుల సంరక్షణ, సమాజహితం కోసం పాటుపడాలనే లక్షణాలను తల్లిదండ్రులు పెంపొందించుకుంటే వారిని పిల్లలు అనుకరించే అవకాశం ఉంది.

ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రస్తుతం సమాజంలో ప్రమాదాల్లో మరణిస్తున్న వారి సంఖ్య ఏటేటా పెరిగిపోతోంది. ఎక్కువగా 20–25 ఏళ్ల మధ్య ఉన్న కుర్రాళ్లు మృతులుగా ఉంటున్నారు. అందులోనూ ఎక్కువగా అతివేగం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందుకోసం తల్లిదండ్రులు తమపిల్లలను హాస్పిటళ్లకు తీసుకెళ్లి రోడ్డు ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయో..ఎందుకు జరుగుతున్నాయో తెలిసేలా చేస్తే వారిలో చిన్నతనం నుంచే మార్పు వచ్చే అవకాశం ఉంటుంది

కుటుంబ ఆప్యాయతలు...

ప్రస్తుతం ఒంటరి కుటుంబాలే అనేకం. ఉమ్మడి కుటుంబాల సంస్కృతి కనుమరుగవుతున్న నేపథ్యంలో ఎక్కడున్నా తమ సొంత ఊరికి సెలవుల్లో పిల్లలను తీసుకెళ్లాలి. అక్కడ తాతయ్య, అమ్మమ్మ, బామ్మలు, అత్తలు, మామలు, బాబాయ్‌ల ఆప్యాయతను రుచి చూపించాలి. అందరూ కలసిమెలసి ఉంటే కలిగే ప్రయోజనాలను వివరించాలి. వ్యవసాయం అంటే ఏమిటి? రైతు ఎంతకష్టపడితే తిండి తింటున్నామో, పదార్థాలను వృథా చేయడం తప్పు అని వారే తెలుసుకునేలా చేయాలి.

వివిధ సంస్థల పనితీరు తెలిసేలా..

పిల్లలకు దగ్గరలోని పోలీసు స్టేషన్లు, ఫైర్‌స్టేషన్లు, కోర్టు, జైలుకు తీసుకెళ్లి వాటి పనితీరుపై అవగాహన కల్పించాలి. జైలులోని శిక్షలు వాటి గురించి అవగాహన వస్తే వారు అలాంటి తప్పులు చేయకుండా ఉండడానికి వీలు ఉంటుంది. అంతేకాక బ్యాంకులు, పోస్టాఫీసులు, మీసేవ కేంద్రాలు తదితర వాటి పనితీరును వివరిస్తే భవిష్యత్‌లో వాటి సేవలను సులభంగా వినియోగించుకునే అవకాశం ఉంది.

మత సామరస్యం గురించి..

పిల్లలను అన్ని మతాల దేవాలయాలకు తీసుకెళ్లాలి.అక్కడ ఏ మతానికి సంబంధించిన విషయాలను పిల్లలకు చెప్పాలి. అన్నిమతాలు ప్రేమించమనే చెప్పాయని, ద్వేషించమని ఏ మతమూ చెప్పడం లేదని తెలియజేస్తే వారు భవిష్యత్‌లో మత సామరస్యాన్ని పాటించే అవకాశం ఉంది. పెద్దలపై గౌరవం కోసం వృద్ధాశ్రమాలు, అనాథశ్రమాలను పిల్లలకు చూపించాలి.

సమాజం గురించి పిల్లలకు తెలపాలి



ప్రస్తుతం సమాజంలో పిల్లల పరిస్థితి తలుచుకుంటే భయంగా ఉంది. పుట్టిన పిల్లవాడి దగ్గర నుంచి సెల్‌ఫోన్లు, వీడియో గేమ్స్, ఆడియోలు, కిడ్స్ చానళ్లను వీడడంలేదు. వాటిలో చూపించే ఫైటింగ్‌లు, కాల్పడాలు, చంపడాలపై పిల్లలు ఎక్కువగా ఆసక్తిని పెంచుకుంటున్నారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. వాటిన్నింటిపై పిల్లల మనసును మళ్లించాలంటే తల్లిదండ్రులు పిల్లలకు బుక్ రీడింగ్ అలవాటు చేయాలి. మత సామరస్యం, సంస్థల పనితీరు, కుటుంబ ఆప్యాయతలు, వృద్ధులను గౌరవించడం కోసం స్వయంగా వారిని సంబంధిత ప్రదేశాలకు తీసుకెళ్లాలి. ఇందుకు దసరా, సంక్రాంతి, వేసవి సెలవులను వినియోగించుకోవాలి.
– పి.మారుతి, కవి, రచయిత, కర్నూలు

ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తాం



పిల్లల కోసం సమ్మర్‌లో ప్రత్యే క్యాంపులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వారి అభిరుచిని బట్టి స్టేడియాల్లో యోగ, పుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, క్రికెట్, ఇతర విభాగాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆటలతో పిల్లల్లో మానసిక, శారీరక శక్తి వృద్ధి చెందుతుంది. తల్లిదండ్రులే పిల్లలను ఆటల్లో రాణించేలా ప్రోత్సహించాలి. – టీవీ రమణ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్, కర్నూలు

సమస్యలకు సత్వర పరిష్కారం

- నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ



వినతులు పరిశీలిస్తున్న నగరపాలక కమిషనర్

కర్నూలు (టౌన్) : నగరపాలక పరిధిలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలకలోని కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల ప్రజల నుంచి కమిషనర్ అర్జీలు స్వీకరించారు. స్పందనలో డిప్యూటీ కమిషనర్ ఎస్ వి. రమాదేవి, నగరపాలక ఎస్ ఈ వేణుగోపాల్ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్ కుమార్, హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునీద్, ఎస్ఎస్ నాగరాజు పాల్గొన్నారు.

సమస్యలివే...

- సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు భవానీ నగర్, బంజార కాలనీకి చెందిన అహమ్మద్‌హుస్సేన్ వినతిపత్రం అందజేశారు.
- తమ ఆర్థిక పరిస్థితి బాగాలేదు. తాము కట్టిన టిడ్కో ఇంటి రుణం వాపస్ ఇప్పించాలని పోస్టల్ కాలనీకి చెందిన హఫీజా విన్నవించారు.
- తమ కాలనీలో అక్రమ నిర్మాణాలతో మురుగు నీటి సమస్య ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎన్ఆర్ పేటకు చెందిన శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.
- రెండు రోజులకు ఒకసారి ఒక గంట మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తుండటంతో ఇక్కట్లకు గురవుతున్నట్లు పార్థసారధినగర్‌కు చెందిన శ్రీనివాసులు అధికారులకు విన్నవించారు.
- నూతనంగా ఏర్పడిన తమ కాలనీలో తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని తుంగభద్ర కాలనీకి చెందిన రవికాంత్ అభ్యర్థించారు.

23న అష్టావధానం

కర్నూలు కల్చరల్: భావనా ప్రియ సాహిత్య బృందం ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ కవి, దంత వైద్యులు బోరెల్లి హర్ష అష్టావధానం నిర్వహిస్తారని నిర్వాహకులు డాక్టర్ సంజీవరాయుడు, శ్రీనివాసులు తెలిపారు. శతావధాని డాక్టర్ వారణాసి శివరామకృష్ణ సంచాలకులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. అవధాని గంగుల ధర్మరాజు, ఆదవాని హనుమంతప్ప, ఆవుల చక్రపాణి యాదవ్, అవశూరు సీతమ్మ, కె.వె. సుబ్బలక్ష్మి, దండెబోయిన పార్వతీ దేవి, వెంకటలక్ష్మి, ఇనాయతుల్లాలటు పృచ్ఛకులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

కొనసాగుతున్న వామపక్షాల ప్రచారభేరి

కర్నూలు(సెంట్రల్) : సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం నగరంలోని 1, 50, 51, 11వ వార్డుల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, ఎం.రాజశేఖర్, సీపీఐ నాయకులు మనోహర్ మాణిక్యం, చంద్రశేఖర్, మహేష్, తదితరులు హాజరై ఆయా వార్డుల్లో ఇంటింటా తిరిగి బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అలాగే చెక్కుపోస్టు, సోమిశెట్టినగర్, మాకినేని బసవయ నగర్, సీక్యాంపు తదితర ప్రాంతాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో ప్రచార భేరి కొనసాగింది. సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు టి.రాముడు, పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పేదల గుడిసెలకు పట్టాలివ్వాలి

కర్నూలు(సెంట్రల్): గొందిపర్ల, పసుపుల గ్రామాల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం గొందిపర్ల, పసుపల గ్రామాలకు చెందిన పేదలు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..గతంలో పేపర్ మిల్లులో పనిచేసే చిప్పర్ హౌస్ సెక్షన్ కాలనీలోని పేదలు కంపెనీకి సమీపంలోని సర్వే నంబర్ 106లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈ.తాండ్రపాడు సర్పంచ్ బాలపీరా, గొందిపర్ల మాజీ సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): చేతివృత్తిదారులను కేంద్రం ఆదుకోవాలని చేతివృత్తిదారులసంఘం జిల్లా కన్వీనర్ సి.గురు శేఖర్, ప్రధాన కార్యదర్శి కె.రాజు, సీనియర్ నాయకులు జి.రామకృష్ణ అన్నారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో గొర్రెలు మేకల పెంపకందారుల సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి పి.గోవిందు అధ్యక్షతన చేతివృత్తిదారుల సంఘ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ..కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు వేస్తోందన్నారు. ప్రపంచీకరణ పేరుతో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారన్నారు. చేనేత, కల్లుగీత, గొర్రెలు, మేకల పెంపకందారులు, కుమ్మరి, కమ్మరి, మేదర, మత్స్య, రజక, వడ్రంగి, దర్జీ, కంచర వంటి వారి అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు.





ఇఫ్తార్ దువా చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ, ముస్లిం మత పెద్దలు, నమాజ్ చదువుతున్న ముస్లింలు

ముస్లింలకు ఎస్వీ ఇఫ్తార్ విందు

కర్నూలు(రాజ్‌విహార్) : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక గిప్సన్ కాలనీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముస్లింలు, మత పెద్దలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ శుభాలు ప్రతి ముస్లింకు అందాలని ఆకాంక్షించారు.

స్పోర్ట్స్

షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్) : ఈనెల 22, 23 తేదీల్లో అనంతపురం పట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ చాటాలని కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, ఓర్వకల్లు సర్పంచ్ అనూష అన్నారు. సోమవారం స్థానిక బి. క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశరాముడు, నాగరాజు పాల్గొన్నారు.

సీనియర్ హాకీ జట్టు ఎంపిక

కర్నూలు (టౌన్) : హాకీ కర్నూలు సీనియర్ జట్టును సోమవారం ఆ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ ప్రకటించారు. ఎంపికైన వారిలో జయరాముడు, శ్రావణ్‌కుమార్, మధు, ఓబులేష్, వీరేష్, వాస్, రవికుమార్, దినేష్, శివాంజనేయులు, రాఘవ, చిన్న ఉరుకుంద, మధు పెద్దయ్య, జమ్ములయ్య, రవికుమార్ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎంపికయిన సీనియర్ హాకీ జట్టు ఈనెల 21 నుంచి 24 వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే 13 వ హాకీ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని వెల్లడించారు.

రేపటి నుంచి 7 ఏ సైడ్ హాకీ కప్ టోర్నమెంట్

కర్నూలు (టౌన్) : ఈనెల 19, 20 తేదీల్లో స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో సీనియర్ హాకీ క్రీడాకారుడు, దివంగత సి.ప్రతాప్‌రెడ్డి మెమోరియల్ పేరుతో 7 ఏ సైడ్ హాకీ కప్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురుచరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంటు విజేతలకు కప్‌లు, టీషర్టులు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉత్తమ ఆటగాళ్లను ప్రోత్సహించడానికి కొత్త హాకీ స్టిక్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన హాకీ జట్లు తమ వివరాలను డి. ప్రవీణ్ 8309427532 సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

ఈ రోజు

రగ్బీ జూనియర్ జట్టుకు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యామందిర్ క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం 10 గంటలకు అండర్–18 విభాగంలో రగ్బీ జూనియర్ బాలుర జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి గుడిపల్లి సురేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మార్కెట్ యార్డు షాపులకు వేలం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం 15 షాపుల వాణిజ్య సముదాయానికి వేలంపాట నిర్వహించనున్నారు. మార్కెట్ యార్డు స్థలంలో బయటికి అంటే పంప్‌హౌస్ రోడ్డు వైపునకు షాపులు నిర్మించారు. వీటిని వేలంపాట ద్వారా కేటాయించనున్నారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేలంపాట జరుగుతుంది. వేలంపాటలో పాల్గొనేందుకు దాదాపు 250 మంది దరఖాస్తులు కొనుగోలు చేశారు. వేలంపాటలో పాల్గొనాలంటే మార్కెట్ కమిటీ పేరిట రూ.50 వేలకు డీడీ తీసి డిపాజిట్ కింద ఇవ్వాల్సి ఉంది. సోమవారం మధ్యాహ్నానికి 190 మంది రూ.50 వేల ప్రకారం డీడీలు తీసి మార్కెట్ కమిటీ కార్యాలయంలో సమర్పించారు. ఈ నెల 18న మధ్యాహ్నం 3 గంటలకు ఇస్కాన్ భోజన శాలలో వేలంపాట నిర్వహిస్తారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్‌తో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సెక్రటరీ గోవిందు కూడా పాల్గొంటారు. కాగా మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు మంగళవారం ఉదయం కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన మార్కెట్ కమిటీ సెక్రటరీలతో సమావేశం నిర్వహిస్తారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు



మహిళలకు సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో నవరత్నాల పేరుతో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 35వ వార్డు పరిధిలోని చింతలముని నగర్‌లో స్థానిక కార్పొరేటర్ మాధురి, వార్డు ఇన్‌చార్జ్ వీరయ్య ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సక్రమంగా సేవలు అందిస్తున్నారా అని ఆరా తీశారు. కొందరు తమ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ఎమ్మెల్యేకు విన్నవించగా సానుకూలంగా స్పందించారు. అనంతరం వక్ఫ్ బోర్డు మసీదు వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంజాన్ ఈద్ నమాజ్‌కు పాత ఈద్గా, కొత్త ఈద్గాలలో స్థలం సరిపోకపోతుండటంతో ఈ ఏడాది కల్లూరు చెన్నమ్మ సర్కిల్ సమీపంలోని మస్జిదే హాజరత్ మౌలానా యూసుఫ్ సాబ్ రహమతుల్లా అలై మసీదులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారన్నారు. పరిసర ప్రాంతాల్లోని ముస్లింలు నమాజ్‌కు ఈ మసీదును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దా రేణుక, కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, డీఎల్ కాంతారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముల్లా హుస్సేన్ సాహెబ్, శివ, బాలచంద్రారెడ్డి, హనుమంతయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా చూసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఈ మండు వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. సోమవారం బుధవారపేటలోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులకు 'అందరికీ జీవనశైలి, మన ఆరోగ్యం–గృహవైద్యం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో వ్యాధులకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ముఖ్యంగా ఆత్మన్యూనతాభావానికి గురిగాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార, విహార, నడక, వ్యాయామం, ప్రాణాయామం, ధ్యానం, యోగా పద్ధతులు, పోపుగింజల ఉపయోగాల గురించి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ఎన్. చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఎస్. సాదిక్వా, కలిమున్నీసా, దావూద్ హుసేన్, కాంపౌండర్ మంగమ్మ పాల్గొన్నారు.

పాటిల్ నీరజారెడ్డి మృతికి సంతాపం

కర్నూలు(సెంట్రల్): పత్తికొండ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దివంగత పాటిల్ శేషిరెడ్డి సతీమణి, ఆలూరు మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజారెడ్డి మృతికి కాంగ్రెస్ పార్టీ సంతాపం ప్రకటించింది. ఆమె రోడ్డు ప్రమాదంలో మరణించడం అత్యంత బాధాకరమని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆమె వైఎస్ఆర్ చలువతో ఆలూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు బతుకన్న, బజారప్ప, ఖాజా హుస్సేన్, ప్రమీల ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి మృతి తీరని లోటు

కర్నూలు కల్చరల్: ఆలూరు మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజారెడ్డి మృతి బీజేపీకి, ఆలూరు అసెంబ్లీ నియోజక వర్గానికి తీరని లోటని బీజేపీ జిల్లా అధ్యక్షులు రామస్వామి అన్నారు. సోమవారం ఆస్పత్రిలోని మార్చురీలో ఉన్న నీరజారెడ్డి మృతదేహాన్ని బీజేపీ సీనియర్ నాయకులు, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, జిల్లా అధ్యక్షులు రామస్వామి, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘంకో కన్వీనర్ కపిలేశ్వరయ్య సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి వాల్మీకి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మీసాల ప్రేమ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు రంగస్వామి, సందడి సుధాకర్ పాల్గొన్నారు.

సాయం అందజేత

కల్లూరు: రుక్మిణి నగర్‌లో నివాసం ఉంటున్న పింజరి ఖాసిం ఆదివారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించాడు. ఖాసింకు వైఎస్సార్ బీమా ఉండటంతో నామినిమాబీకి సోమవారం మట్టి ఖర్చుల నిమిత్తం 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి రూ. 10 వేలు అందజేశారు.